సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 5 । ఆగస్టు । 2025



ఆ జీవో విద్యార్థుల గొంతు నొక్కేందుకే..! 8లో



అధికారుల నిర్లక్ష్యం వల్లే అర్జీల రిపీట్ 8లో



రక్షకులు కాదు.. గో భక్షకులు 8లో

న్యూస్‌రీల్

అప్పన్న హుండీ ఆదాయం రూ.2.78 కోట్లు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం గత 28 రోజులకు రూ.2,78,53,475 లభించినట్లు దేవస్థానం ఇన్‌చార్జి ఈవో వి.త్రినాథరావు తెలిపారు. సింహగిరిపై పరకామణి కేంద్రంలో సోమవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. నగదుతోపాటు 95 గ్రాములు బంగారం, 11.350 కిలోల వెండి లభించినట్టు పేర్కొన్నారు. ఈ లెక్కింపులో దేవస్థానం అధికారులు, సిబ్బంది, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రీడా దినోత్సవ పోటీలు

విశాఖ స్పోర్ట్స్ : జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నుంచి క్రీడాపోటీలు క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభం కానున్నాయి. పది క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఆర్చరీ, బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, బ్యాడ్మింటన్‌లతో పాటు అథ్లెటిక్స్ వ్యక్తిగత అంశాలతో పాటు బాస్కెట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, హాకీ క్రీడల్లో ఈ పోటీలు జరగనున్నాయి. 22 ఏళ్ల పురుషులు, మహిళలు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు కాగా జిల్లా స్థాయి పోటీలు ఈనెల 5 నుంచి 10 వరకు, జోనల్ పోటీలు 11 నుంచి 14 వరకు, రాష్ట్ర స్థాయి పోటీలు 16 నుంచి 20 వరకు జరగనున్నాయి. ఆసక్తి గల వారు ఆధార్ కార్డు, వయసు ధృవీకరణ పత్రంతో పాటు రెండు ఫొటోలతో హాజరుకావచ్చని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది.

నూతన మార్గదర్శకాలకు అనుగుణంగా పిల్లల దత్తత



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్ తదితరులు

మహారాణిపేట : కేంద్ర ప్రభుత్వం నూతనంగా రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం పిల్లల దత్తత ప్రక్రియను నిర్వహించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పాన్ కార్డు, ఆదాయ, వయస్సు, నివాస, వివాహ, ఆరోగ్య ధృవీకరణ పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ మేరకు సంబంధిత పోస్టరును సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో ఆయన ఆవిష్కరించారు. దత్తత తీసుకోవాలనుకునే వారు అదనపు సమాచారం కోసం దగ్గరలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని, ఐసీడీఎస్ పీడీ, ఇతర అధికారులను, జిల్లా బాలల పరిరక్షణ అధికారిని సంప్రదించవచ్చన్నారు. www.cara.wcd.gov.in వెబ్‌సైట్‌లోను వివరాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్, ఐసీడీఎస్ పీడీ రామలక్ష్మి పాల్గొన్నారు.

అప్పన్న దేవస్థానం శానిటేషన్ ఇన్‌చార్జి సస్పెన్షన్

సింహాచలం: విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం శానిటేషన్ విభాగం ఇన్‌చార్జి జి.కొండలరావును(జూనియర్ అసిస్టెంట్ క్యాడర్) దేవస్థానం ఈవో వి.త్రినాథరావు సోమవారం సస్పెండ్ చేశారు. సింహగిరిపై శానిటేషన్ పనులు సక్రమంగా జరుగుతున్నాయో లేదో పరిశీలించాల్సిన బాధ్యతను కొండలరావు విస్మరించడంతో ఈవో వి.త్రినాథరావు గతంలోనే ఒకసారి అతన్ని హెచ్చరించారు. ఇటీవల సింహగిరిపై గాయత్రీమఠం, బస్టాండ్ తదితర ప్రదేశాల్లో శానిటేషన్ అధ్వానంగా తయారవడంపై పలువురు భక్తులు స్వయంగా దేవస్థానం ఈవోకే ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర పరిశీలన చేసిన ఈవో విధుల్లో అలసత్వం ప్రదర్శించిన కొండలరావును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కేకే లైన్‌లో పట్టాలపై బండరాయి



సాక్షి, పాడేరు : కొత్తవలస- కిరండోల్ రైల్వే లైన్లో పట్టాలపై బండరాయి పడడంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వర్షాలు కురుస్తుండడంతో అనంతగిరి మండలంలోని బొర్రా- చిమిడిపల్లి మధ్య గల రైల్వే పట్టాలపై సోమవారం సాయంత్రం 4.30 గంటల సమయంలో బండరాయి జారిపడింది. దీంతో కేకే లైన్‌లో రైళ్ల రాకపోకలు అంతరాయం ఏర్పడింది. అనంతరం యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టారు.

కూటమి నేతల్లో భూకంపం!

సొంత పార్టీ నేతలే విమర్శనాస్త్రాలు

- ఎండాడ భూమిపై ఇప్పటికే విచారణ కోరిన గంటా
- రెవెన్యూ మంత్రికి లేఖ రాసిన స్పీకరు అయ్యన్నపాత్రుడు
- అదే పనిగా ప్రశ్నలు సంధిస్తున్న జనసేన కార్పొరేటర్
- కనీసం స్పందించని ప్రభుత్వం
- చినబాబు హస్తం ఉండటమే కారణమని గుసగుసలు



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

కూటమి పార్టీల మధ్య మాటల 'భూ'కంపం మొదలైంది. ఎండాడలోని 5 ఎకరాల విషయంలో విచారణ జరగాల్సిందేనని మొన్నటికి మొన్న గంటా శ్రీనివాసరావు లేఖ రాయగా.. తాజాగా ఏకంగా స్పీకరు అయ్యన్నపాత్రుడు లేఖాస్త్రం సంధించారు. మరోవైపు అన్ని వ్యవహారాల్లోనూ తానుండాల్సిందేనని రీతిలో తలదూర్చే జనసేన కార్పొరేటర్ కూడా ఈ వ్యవహారంలో విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టారు. ఎండాడలోని 5.10 ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించి.. ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి అప్పగించేలా కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వెనువెంటనే ఆ భూమి అభివృద్ధి పేరిట రిజిస్ట్రేషన్లు కూడా జరిగిపోయాయి. మరోవైపు సొంత పార్టీ నేతల నుంచే విమర్శలు ఎదురవుతున్నప్పటికీ ఈ వ్యవహారంపై ఇప్పటివరకు అధికారికంగా ఏ ఒక్కరూ స్పందించకపోవడం గమనార్హం. ఈ భూ వ్యవహారంలో 'దక్షిణ' నేతతో పాటు చినబాబు పాత్ర ఉండటంతో విచారణ జరగడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సొంత పార్టీ నేతలే..!

సాధారణంగా ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలపై ప్రతిపక్షాల నుంచి విమర్శలు రావడం సహజం. ఎండాడ భూమి విషయంలో మాత్రం విచిత్రంగా కూటమిలో భాగస్వామిగా ఉన్న జనసేన నేత వైఎస్సార్‌సీపీ నేతలపై విమర్శలు సంధిస్తున్నారు. నిజంగా ఈ వ్యవహారంలో వైఎస్సార్ సీపీ నేతలు ఉంటే విచారణ జరిపేందుకు ఎందుకు ముందుకు వెళ్లడం లేదన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి. అంతేకాకుండా ఈ వ్యవహారంలో స్థానిక ఎమ్మెల్యే పాత్ర ఉందంటూ కేవలం విమర్శలు రావడంతోనే నేరుగా కలెక్టరుకు గంటా శ్రీనివాసరావు లేఖ రాశారు. ఈ లేఖ రాసి సుమారు నెల రోజులు కావస్తోంది. మరోవైపు ఇందులో తన పాత్ర లేదని, విచారణ జరపాలంటూ స్పీకరు అయ్యన్నపాత్రుడు తాజాగా నేరుగా రెవెన్యూ మంత్రికే లేఖ సంధించారు. దీనిపై ప్రభుత్వం నుంచి కనీస స్పందన రావడం లేదు. విచిత్రంగా ఇందులో ప్రతిపక్ష పార్టీ పాత్ర ఉందంటూ పసలేని ఆరోపణలు గుప్పిస్తున్నారు. మొత్తం వ్యవహారాన్ని నడిపింది తమ వారేనని.. ప్రధాన పాత్ర అంతా చిన్నబాబుదేనని తెలిసినప్పటికీ వైఎస్సార్ సీపీ మీద ఎక్కుపెట్టి.. పరోక్షంగా చిన్నబాబునే లక్ష్యంగా చేసుకున్నారనే వాదన కూడా ఆ పార్టీ నేతల్లో వ్యక్తమవుతుతుంది. అయితే, ఈ విషయంలో నిజంగా విచారణ జరిపితే.. రికార్డుల ట్యాంపరింగ్‌తో పాటు వ్యవహారం నడిపి నగదు, ఎకరన్నర పొలాన్ని కొట్టేసిన దక్షిణ నియోజకవర్గ నేతతో పాటు చిన్నబాబు పాత్ర కూడా బయటకు వచ్చే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇదీ భూ దందా నేపథ్యం..!



ఎండాడలోని సర్వే నెంబరు 14-1లోని 5.10 ఎకరాల భూమికి చెందిన రికార్డుల్లో రెవెన్యూ అధికారులనూ తికమకపెట్టే వ్యవహారాలు తెరవెనుక నడిచాయి. రికార్డుల్లో ఒక పేరు.. ఆదేశాల్లో మరో పేరు.. అంతిమంగా ప్రభుత్వ భూమిని కాస్తా ప్రైవేటుపరం చేస్తూ నిర్ణయాలు వెలువడ్డాయి. 14-1 సర్వే నెంబరులోని భూమి చెట్టిపల్లి సీతారామయ్య పేరు మీద నమోదై ఉంది. అయితే, విచిత్రంగా తాజాగా కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల్లో మాత్రం ఈ భూమి మాజీ సైనిక అధికారికి చెందినదని.. చెట్టిపల్లి సీతారామయ్య పేరు కేవలం ఫారం-3లో మాత్రమే ఉందని పేర్కొన్నారు. ఇందుకు భిన్నంగా అసలు వ్యక్తి సాగులోనే లేరంటూ వై.బాలిరెడ్డికి చెందినదంటూ ఆయన పేరు మీద బదలాయించాలంటూ ఆదేశాల్లో పేర్కొన్నారు. వాస్తవానికి ఈ భూమికి సంబంధించిన ఫైలు గత కొద్దికాలంగా కలెక్టరేట్‌లో చక్కర్లు కొట్టినట్టు తెలుస్తోంది. ఇందుకు అనుగుణంగా కింది స్థాయి నుంచి రికార్డులను సృష్టించారనే విమర్శలున్నాయి. అడంగల్‌తో పాటు గతంలో స్వయంగా కలెక్టర్ సంతకంతో ఎండాడలోని సర్వే నెంబరు 14-1కు చెందిన 5.10 ఎకరాల భూమి పట్టాదారు చెట్టిపల్లి సీతారామయ్య పేరు మీద ఉందని.. ఇది ప్రభుత్వ భూమి కావడంతో రిజిస్ట్రేషన్ చేయవద్దని పేర్కొంటూ జిల్లా రిజిస్ట్రార్‌కు పంపారు. ఇక అడంగల్ కూడా ఈయన పేరు మీదనే ఉంది. అయినప్పటికీ సీతారామయ్య పేరు కేవలం ఫారం-3లో మాత్రమే ఉందని, దీనిని తొలగించాలని కూడా కలెక్టర్ తాజాగా జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో పై నుంచి ఆదేశాలు వచ్చేందుకు కీలకంగా వ్యవహరించిన విశాఖ దక్షిణ నియోజకవర్గానికి చెందిన నేత 'సీతయ్య' లెవెల్‌లో చక్రం తిప్పినట్టు సమాచారం. ఇందుకోసం ఆయన భారీగా నగదుతో పాటు ఎకరన్నర పొలం కూడా లబ్ధిపొందినట్టు తెలుస్తోంది. అంతేకాకుండా ఇంకా ఏమైనా ఫైల్స్ ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వ్యవహారం నడిపిద్దామంటూ డీల్స్‌కు దిగుతున్నట్టు కూడా సమాచారం.

న్యాయవాదులకు మార్గదర్శి వడ్లమాని

హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ ఎం.నారాయణ రెడ్డి



శ్రీరామమూర్తి చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న ఏపీ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ నారాయణ

విశాఖ లీగల్ : న్యాయవాదులకు వడ్లమాని శ్రీరామమూర్తి జీవితం మార్గదర్శకమని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ ఎం.నారాయణరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కోర్టు నూతన భవన ప్రాంగణం సమావేశ మందిరంలో ప్రముఖ న్యాయవాది వడ్లమాని శ్రీరామమూర్తి చిత్రపటాన్ని జస్టిస్ నారాయణరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాష పాండిత్యం న్యాయశాస్త్రం మెలకువలు శ్రీరామమూర్తి సొంతమన్నారు. ఆయన ప్రతిభను సర్వోన్నత న్యాయస్థానాలు సైతం ప్రశంసలు అందించాయన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు మాట్లాడుతూ ఒక సీనియర్ న్యాయవాది న్యాయవ్యవస్థకు దిక్సూచిగా పేర్కొన్నారు. ప్రముఖ న్యాయవాది కె.వి.రామ్మూర్తి మాట్లాడుతూ వడ్లమాని శ్రీరామ్మూర్తి తన అనుభవాలు లెక్కకు మిక్కిలి అన్నారు. న్యాయవాదులు ఎం.రామదాసు, పి.వి.నారాయణరావు డి.రమేష్, కె.రామజోగేశ్వరరావు, ఎండి హబీబుల్లా, ఉమాశంకర్ అన్నయ్య శాస్త్రి, వెంకటరమణ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం.కె.శ్రీనివాస్ అధ్యక్షత వహించగా.. కార్యదర్శి ఎల్.పార్వతీశ్వరనాయుడు, రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు కె.రామజోగేశ్వరరావు, నమ్మి సన్యాసిరావు, ఐదు తరాలకు చెందిన వడ్లమాని శ్రీరామ్మూర్తి కుటుంబ సభ్యులు, జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, అధిక సంఖ్యలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

యాప్‌లతో వేగలేం..



సెల్‌ఫోన్లు చూపిస్తూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

- ఆన్‌లైన్ సేవలు బహిష్కరించిన అంగన్‌వాడీలు
- సెల్ ఫోన్లతో ఐసీడీఎస్ కార్యాలయం ముందు రోడ్డుపై నిరసన

మర్రిపాలెం : అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం నుంచి పూర్తి స్థాయిలో నో ఫోన్ నో వర్క్ విధానాన్ని పాటిస్తామని.. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని.. ప్రభుత్వం తీరు మారకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సభ్యులు హెచ్చరించారు. ఆర్అండ్‌బీ జంక్షన్ సమీపంలోని ఐసీడీఎస్ కార్యాలయం ముందు సోమవారం సెల్‌ఫోన్లు రోడ్డుపై ఉంచి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లబ్ధిదారుల సౌకర్యార్థం ఆఫ్‌లైన్‌లో మాత్రమే సేవలు అందిస్తామన్నారు. పోషణ ట్రాకర్, బాల సంజీవని యాప్‌లతో పనిభారం పెరగడంతో పాటు అదనంగా ఆరోగ్య శాఖకు చెందిన ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం ద్వారా ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు చేయాల్సిన గర్భిణులు, బాలింతల నమోదు ప్రక్రియ సైతం తమకే అప్పగించడంతో ఇలాంటి నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఆన్‌లైన్ విధానంతో సర్వర్ పనిచేయకపోవడం ఒక ఎత్తయితే మరో పక్క సెల్‌ఫోన్‌లు మొరాయించడంతో లబ్ధిదారులు అంగన్‌వాడీ కేంద్రాల చుట్టూ తిరుగుతూ తమపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని వాపోయారు. ఎన్నికల ముందు చంద్రబాబు, లోకేష్ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోజుల వ్యవధిలో పనిభారం తగ్గించి వేతనాలు పెంచుతామని హామీలు ఇచ్చి, ఇప్పుడు అంగన్‌వాడీలను పూర్తిగా పక్కకు పెట్టేశారన్నారు. అనంతరం అర్బన్ సీడీపీవో నీలిమకు తమ సెల్ ఫోన్లు అప్పగించే ప్రయత్నం చేయగా.. ఫోన్‌లు ఇలా ఇవ్వడం వల్ల డేటా పోయే ప్రమాదముందని ఆమె సర్దిచెప్పారు. దీంతో ఆమెకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ గౌరవ అధ్యక్షురాలు మణి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటీయూసీ నాయకులు ఎం.వెంకటలక్ష్మి, శ్యామలాదేవి, కృపారాణి, నూకరత్నం, అన్నపూర్ణ పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాలపై కూటమి కక్ష

- యూరియా సైతం పంపిణీ చేయలేని వైనం
- కూటమి ప్రభుత్వ హయాంలో 250 మంది అన్నదాతల ఆత్మహత్య
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, చిత్రంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, సమన్వయకర్తలు మళ్ల విజయప్రసాద్, మొల్లి అప్పారావు, జెడ్పీ వైస్‌చైర్మన్ సుంకరి గిరిబాబు, పార్టీ నేతలు జహీర్ అహ్మద్, పేడాడ రమణికుమారి

మహారాణిపేట: రైతును రాజుగా చూడాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి భరోసాగా నిలిచారని, విత్తనం వేసిన దగ్గర నుంచి పంటకు మద్దతు ధర వచ్చేవరకు రైతన్నలకు జగన్ సర్కారు ధైర్యమిచ్చేదని పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు అన్నారు. రైతులకు యూరియా కొరత, ఇతర సమస్యలపై పార్టీ నాయకులు కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కే.కే.రాజు మాట్లాడుతూ గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలను కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో యూరియా సరఫరా డిమాండ్‌కు తగ్గట్లుగా లేదని, చంద్రబాబు నాయుడు రైతులకు న్యాయం చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 14 నెలల్లో 250 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని అన్నారు. నిన్న జరిగిన రైతు భరోసా కార్యక్రమంలో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ రైతులకు భరోసా ఉండదని చేసిన వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శాసన మండలి సభ్యురాలు వరుదు కల్యాణి మాట్లాడుతూ, జగన్ పాలనలో రైతులకు గిట్టుబాటు ధర ఉండేదని, ఇప్పుడు అది లేకపోవడం వల్ల రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు కేవలం రూ.5 వేలు మాత్రమే జమ చేసిందని, వారి సమస్యలను గాలికి వదిలేసిందని విమర్శించారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోని రైతు భరోసా అమలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గాల సమన్వయకర్తలు మళ్ల విజయ ప్రసాద్, మొల్లి అప్పారావు, జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ సుంకరి గిరిబాబు , డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ , పార్టీ కార్యాలయ పర్యవేక్షకులు రవి రెడ్డి, పార్టీ ముఖ్య నేతలు పేర్ల విజయ చందర్, జహీర్ అహ్మద్, గొలగాని శ్రీనివాస్, అల్లంపల్లి రాజబాబు, రాంబాబు, బంకు సత్యం, మువ్వల సురేష్, అంబటి నాగ శైలేష్, పేడాడ రమణికుమారి, సనపల రవీంద్ర భరత్, బోని శివ రామకృష్ణ, పీలా ప్రేమ కిరణ్ జగదీష్, కర్రి రామిరెడ్డి, వంకాయల మారుతీ ప్రసాద్, నీలి రవి, శశికళ, బిపిన్ కుమార్ జైన్, పల్లా దుర్గారావు, డాక్టర్ మంచా నాగ మల్లేశ్వరి, మక్సూద్ అహ్మద్ , ఇ.సత్యనారాయణ, కంచుమూర్తి పద్మ శేఖర్, శ్రీదేవి వర్మ , బోరవిజయ లక్ష్మి , రామకృష్ణా రెడ్డి, అప్పన్న , శిరీష్ , మజ్జి జ్యోతి, మధుసూదన్ రెడ్డి, రామభక్త నాయుడు, సత్యవతి, పార్వతి పాల్గొన్నారు.

పేదల భూములపై సర్కారు కన్ను

భూములమ్మి..నిధుల సేకరణ

- ప్రభుత్వ ఆదేశాలతో భారీగా ల్యాండ్ పూలింగ్‌కు సిద్ధమైన అధికారులు
- అసైన్డ్ భూములు, ఆక్రమణల్లో ఉన్న భూముల సేకరణకు కసరత్తు
- విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లో 1,941 ఎకరాల సేకరణే లక్ష్యం
- నోటిఫికేషన్ జారీ చేసిన జాయింట్ కలెక్టర్
- ఈ భూములను వీఎంఆర్‌డీఏకు అప్పగించేందుకు చర్యలు
- భూములను విక్రయించి నిధులు సమకూర్చుకోవాలని ప్రభుత్వ ఆలోచన

మహారాణిపేట: పేదల భూములపై కూటమి సర్కార్ కన్నుపడింది. ల్యాండ్ పూలింగ్ ద్వారా పేదల భూములను సేకరించడానికి కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. దీనికి సంబంధించి జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లోని అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూములను సేకరించనున్నారు. ఈ మూడు జిల్లాల్లో మొత్తం 1941 ఎకరాలను సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. సేకరించిన ఈ భూములను వీఎంఆర్‌డీఏకు అప్పగించి, వాటిని విక్రయించడం ద్వారా నిధులు సమీకరించాలని యోచిస్తోంది. ఇలా వచ్చిన నిధులను ప్రభుత్వానికి జమ చేయాల్సి ఉంటుంది. ఈ నిధులతో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కోసం ఖర్చు చేయనున్నట్లు తెలుస్తోంది. గతంలో పంపిణీ చేసిన అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూములను వెనక్కి తీసుకోవడంపై దృష్టి సారించింది. అసైన్డ్ పట్టా ఉంటే ఎకరానికి 900 గజాలు, ఆక్రమణదారుడైతే ఎకరానికి 450 గజాల స్థలం డెవలప్‌మెంటు చేసి ఇవ్వాలని నిర్ణయించారు. ల్యాండ్ పూలింగ్ కోసం 2016లో చేసిన చట్టం ప్రకారం ముందుకు వెళ్లాలని ప్రభుత్వం ఆదేశించింది. కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ పర్యవేక్షణలో ఆర్‌డీవోలు భూసమీకరణ చేయాలని ప్రభుత్వం ఆదేశాల్లో పేర్కొంది. ఈ భూముల సేకరణ కోసం సోమవారం నోటిఫికేషన్ ఇచ్చామని, ఈ భూసేకరణ అంతా పారదర్శకంగా చేస్తామని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. సోమవారం మీడియాతో జేసీ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం అంతా భూ సేకరణ జరుగుతుందన్నారు. రికార్డ్స్ ట్యాంపరింగ్ జరగకుండా చూస్తామని, రికార్డులను బట్టి ఆక్రమణదారులను గుర్తిస్తామన్నారు.



సేకరించే భూముల వివరాలు

విజయనగరంలో డెంకాడలో సర్వే నంబర్లు 241, 242, 243ల్లో 20.41 ఎకరాలు

భోగాపురం మండలంలో రావాడ సర్వే నంబర్ 64/1లో 5 ఎకరాలు

అనకాపల్లి జిల్లాలో ..


ప్రాంతం	విస్తీర్ణం
సబ్బవరం మండలం అంతకాపల్లిలో	175.42 ఎకరాలు
బాటజంగాలపాలెంలో	141.01 ఎకరాలు
ఏ.సిరసపల్లిలో	371.75 ఎకరాలు
నాళ్ల రేగుడిపాలెంలో	27.37 ఎకరాలు
పైడివాడ అగ్రహారంలో	28.14 ఎకరాలు
అనకాపల్లి మండలంలో తగరంపూడిలో	40 ఎకరాలు

విశాఖ జిల్లాలో..

ప్రాంతం	విస్తీర్ణం
ఆనందపురంలో గిడిజాలలో258 సర్వే నంబర్‌లో	309.18 ఎకరాలు
ఆనందపురంలో గోరింట్ల సర్వే నంబర్ 108లో	198.31 ఎకరాలు
ఆనందపురంలో శొంఠ్యంలో 347/పీ సర్వే నంబర్‌లో	251.55 ఎకరాలు
ఆనందపురంలో జీ.డీ.పాలెంలో సర్వే నంబర్ 1లో	122.53 ఎకరాలు
పద్మనాభంలో కొవ్వాడ 237 సర్వే నంబర్‌లో	250.52 ఎకరాలు

మొత్తం 1941 ఎకరాల 19 సెంట్లు భూమి సేకరిస్తున్నారు

త్వరితగతిన మార్గదర్శుల మ్యాపింగ్



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట : పీ-4 మార్గదర్శుల ఎంపిక ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని.. ఇది పూర్తిగా స్వచ్ఛంద కార్యక్రమమని.. దానికి తగిన విధంగానే చర్యలు తీసుకోవాలని.. ఎవరిపైనా ఒత్తిడి లేదని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన బంగారు కుటుంబాలకు మార్గదర్శులను మ్యాపింగ్ చేయాల్సి ఉందని పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర-2047 ప్రణాళికకు అనుగుణంగా నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు ఆయా శాఖల అధికారులంతా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాథమిక, ద్వితీయ, తృతీయ రంగాల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కార్యాచరణ రూపొందించుకోవాలని చెప్పారు. ఆయా శాఖల పరిధిలో నిర్వహించిన కార్యక్రమాలు, సాధించిన ఫలితాల నివేదికలను పోర్టల్లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్ పాల్గొన్నారు.

మానవత్వమే లేదా..!



జాలిని కలిగించే చూపులు, దయతో చేసే చిన్నపాటి సాయం... ఇవే దివ్యాంగుల జీవితంలో ఆశావహ దృశ్యాలు. కలెక్టరేట్ మెట్లెక్కే ప్రతి దివ్యాంగుడి కథ వెనుక వర్ణనాతీతమైన వేదన దాగి ఉంటుంది. కొందరు కర్ర సాయంతో, మరికొందరు ఎవరినో ఒకరి భుజంపై ఆసరాగా, ఇంకొందరు వీల్‌చైర్‌లో నెట్టుకుంటూ పీజీఆర్ఎస్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక) వైపు అడుగులేస్తుంటారు. వారి మొహంలో కనిపించే ఆవేదన... ప్రభుత్వ సహాయంపై ఉన్న ఆశను, భవిష్యత్తుపై ఉన్న భయాన్ని అద్దం పడుతుంది. కూటమి ప్రభుత్వం రీ-వెరిఫికేషన్ ఆదేశాలు ఇచ్చినప్పటి నుంచి దివ్యాంగుల కష్టాలు రెట్టింపయ్యాయి. 'సదరం' సర్టిఫికెట్లు తిరిగి పరిశీలించడం, అనర్హులను తొలగించడం వంటి చర్యలు వారి జీవితాలపై పిడుగులా పడుతున్నాయి. పుట్టుకతోనే బుద్ధిమాంద్యం, అంగవైకల్యం, మానసిక సమస్యలున్న వారికి ఈ కొత్త నిబంధనలు గుండెల్లో గుబులు రేపుతున్నాయి. పింఛను రద్దు చేస్తే ఎలా? శాతాలు తగ్గిస్తే జీవితం ఎలా సాగాలి? అనే ఆలోచనలు వారిని నిద్రపట్టనివ్వడం లేదు. ప్రతి సోమవారం కలెక్టరేట్ కార్యాలయం దివ్యాంగుల కష్టాలకు సాక్ష్యంగా నిలుస్తోంది. ఎంతో మంది దివ్యాంగులు తమ సమస్యల పరిష్కారం కోసం దూరం నుంచి ఎవరినో తోడు తీసుకొని వస్తున్నారు. ర్యాంపులు, లిఫ్టుల సాయంతో పై అంతస్తులకు చేరుకుని, 'సహాయం చేయండి' అంటూ అధికారులకు వినతి పత్రాలు సమర్పిస్తున్నారు.

- మహారాణిపేట/ ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

నేడు జిల్లాలో పౌర సరఫరాల శాఖ మంత్రి పర్యటన

మహారాణిపేట: రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. అనంతగిరి పర్యటనలో ఉన్న ఆయన ఉదయం 11.30 గంటలకు విశాఖ కలెక్టరేట్‌కు చేరుకుంటారు. ఉత్తరాంధ్ర జిల్లాల అధికారులు, జీసీసీ అధికారులతో జరిగే రీజినల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొంటారు. సాయంత్రం 3 గంటల నుంచి కలెక్టరేట్‌లో పోర్టు అధికారులతో సమావేశమై బియ్యం ఎగుమతులు, ఇతర అంశాలపై సమీక్షిస్తారు. అనంతరం లీగల్ మెట్రాలజీ, ఫుడ్ సేఫ్టీ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమవుతారు.

ANDHRA PRADESH INDUSTRIAL INFRASTRUCTURE CORPORATION LTD
(A Government of Andhra Pradesh Undertaking)
Industrial Estate, Visakhapatnam 530007, Phone No. 0891-2550227, Email: zm.viz.apiic@nic.in

E - Procurement Tender Notice

Short Tender Notice Nos. 13 to 16 /ZM/APIIC/VSP/2025-26, Dated 04.08.2025
Date of Bid download starts from: 04.08.2025 at 8.00 PM to 11.08.2025 upto 1.00 PM. Last date of submission of Bid : 11.08.2025 upto 3.00 PM. Note: The details of Tender Notice and Bid documents can be downloaded from Website : www.apeprocurement.gov.in

Zonal Manager,
Regular Zone, APIIC Ltd., Visakhapatnam Dist.

SRI VIJAYARAMA GAJAPATHI COOPERATIVE SUGARS LTD;
BHIMASINGI, Cell No: 9440369813

TENDER NOTICE

Sealed tenders are invited for purchase of Teak Wood Trees, as detailed below;

Particulars	No.of Trees	Total CFT	EMD Amount
TEAK WOOD TREES	262	3128	25,000/-

The EMD in favour of Sri Vijayarama Gajapathi Coop Sugars Ltd., by way of D.D payable at Sainik School Korukonda. The tender schedule can be obtained on working days from the factory on payment of Rs.500/- per each. The Tenders will be received upto 12.00 noon and opened at 3.00 pm on 20.08.2025 in the Sugar Factory M.D's Chamber.

Date: 04.08.2025 Sd/- MANAGING DIRECTOR.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DISTANCE EDUCATION
■ Discontinued మరియు ఫెయిల్ అయిన స్టూడెంట్స్ తమ డిగ్రీ రెండు నెలల్లో పూర్తి చేసి గవర్నమెంట్ రికగ్నిషన్ కలిగిన డిగ్రీ పొందు అవకాశం కలదు. అడ్మిషన్ కోసం సంప్రదించండి. ఫోన్ : 79972 96796 [V- 12588]

Real Estate

PLOT FOR SALE
■ జనచైతన్య సాయిభారతి లేఅవుట్ పెందుర్తి దగ్గర్లో చింతలపాలెం విలేజ్, కొత్తవలస మం॥ 220 Sq.yds 3 బిట్లు, 660 గజాలు అమ్మకం, డైరెక్ట్ పార్టీస్ మాత్రమే, గజం : 11,000/-. ఫోన్ : 98662 68791 [SCA25006985]

Services

GOLD LOANS
■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 14035]

OLD AGE HOME
■ Elder Home గాజువాక & అక్కయ్యపాలెం వృద్ధుల ఆశ్రమం. వృద్ధులకు మంచాన పున్న వారికి మంచి వాతావరణం, ఆరోగ్యకరమైన భోజనం 24 గం॥ వైద్యసేవలు. హోమ్‌కేర్ సర్వీస్ కలదు. ఫోన్ : 87904 49799, 90103 92178 [SCA25006954]

CHANGE OF NAME
I, BORUSU BHAVANI DEVI (New Name), D/o. DANGETI VENKATA SRINIVASA RAO, W/o. BORUSU SRIRAM , previously called DANGETI BHAVANI DEVI (Old Name) residing at D.No.28-32-12, Muslim Street, RH Colony, Kanithi Colony, Vadlapudi, Gajuwaka, Visakhapatnam-530 046, A.P. Now changed my name from DANGETI BHAVANI DEVI (Old Name) to BORUSU BHAVANI DEVI (New Name) Henceforth I will be called as BORUSU BHAVANI DEVI (New Name) for all purposes.

Wanted
■ స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు 10th ఆపై చదివి, Age: 20-30 కలిగిన (M/F) వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 ✆ 9959031122, 9676901122 [B-1275596]

■ Wanted Male Marketing Incharges and Computer Operators Qualification Any Degree. Age Limit: 25 to 45 years, Salary upto: 20000/- Working Location: Master Minds College, Vizag & Gajuwaka. Contact: 8008556073, 9248722267 [G-6125]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

మురళీనగర్, మాధవధార	: 90101 33346
NAD, కంచరపాలెం	: 90108 10033
గోపాలపట్నం, పెందుర్తి	: 70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్	: 90100 55116
దాబాగార్డెన్స్, జగదాంబ / MVP కాలనీ, మద్దిలపాలెం	90101 96663
గాజువాక	: 97059 33394

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

అధికారుల నిర్లక్ష్యం వల్లే అర్జీల రిపీట్

- తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవు
- అధికారులపై అసహనం వ్యక్తం చేసిన కలెక్టర్
- పీజీఆర్ఎస్‌కు 304 వినతులు

మహారాణిపేట: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)పై ప్రజల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతున్న నేపథ్యంలో కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిర్యాదులను సరిగా పరిష్కరించడం లేదని, అందుకే చాలా కేసులు మళ్లీ రీ-ఓపెన్ అవుతున్నాయని ఆయన మండలించారు. సంబంధిత అధికారులు తగిన శ్రద్ధ చూపకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్‌లతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 304 వినతుల్లో రెవెన్యూకు సంబంధించి 80, జీవీఎంసీ 66, పోలీస్ శాఖకు 22, ఇతర సమస్యలకు 136 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారులకు ఫోన్ చేసి సమస్యను తెలుసుకోవాలన్నారు. అవసరమైతే క్షేత్రస్థాయి పరిశీలన చేసి నాణ్యమైన పరిష్కారం చూపాలని, పరిష్కరించిన ఫిర్యాదులకు తగిన విధంగా ఎండార్స్‌మెంట్ వేయాలన్నారు. కాల్ సెంటర్ పనితీరును మెరుగుపడాలని సూచించారు. అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేసి ప్రజా సమస్యలను సంతృప్తికరంగా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

ఐదుసార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదు



విశాఖ ఉక్కు కర్మాగారం (స్టీల్ ప్లాంట్) భూ సర్వేలో నాకు చెందిన 30 సెంట్ల భూమిని కాపాడాలి. గతంలో ఐదుసార్లు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశా. నా భూమిని సర్వే చేసిన ఆర్ఐ అప్పారావు, సర్వేయర్ హరీష్ ఇబ్బందులు పెడుతున్నారు. పెదగంట్యాడ మండలం సర్వే నంబర్ 71/1/బి/3లో ఉన్న 30 సెంట్ల భూమి నా తాతాముత్తాల నుంచి వారసత్వంగా వచ్చింది. స్టీల్ ప్లాంట్ కోసం కొంత భూమిని తీసుకున్న తర్వాత మిగిలిన భూమిని సబ్-డివిజన్ చేసి ఎండార్స్‌మెంట్ ఇచ్చారు. ఈ భూమిలో బడ్డీ కొట్టు, ఇల్లు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నా..అయితే స్టీల్ ప్లాంట్ అధికారులు తమను ఖాళీ చేయాలని బెదిరిస్తున్నారు. గతంలో భూములు కోల్పోయినప్పటికీ, ఈనాటికీ ఉద్యోగం, పరిహారం గానీ అందలేదు. సమస్యను వెంటనే పరిష్కరించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

- కొల్లి రవణమ్మ, పెదగంట్యాడ

ముస్లింల సమస్యలపై అధికారుల నిర్లక్ష్యం



ఈద్గా, కబరిస్తాన్ (ముస్లిం శ్మశానవాటికలు) మంజూరు చేయాలని కోరుతూ అనేక సార్లు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు చేశా..అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదు. అలాగే వక్ఫ్ బోర్డు భూములపై రీసర్వే చేయాలని, మైనారిటీల ప్రధాన సమస్యలపై సమీక్షా సమావేశం నిర్వహించాలని కోరినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. తమ వినతులను తక్షణమే పరిష్కరించాలి.

- షేక్ బాబ్జి, వైఎస్సార్ సీపీ జిల్లా సమాచార హక్కు చట్టం అధ్యక్షుడు.

నా కుమార్తెకు పింఛను ఇవ్వండి



నా 19 ఏళ్ల దివ్యాంగ కుమార్తె అన్నం సురేఖకు పింఛను మంజూరు చేయాలి. సురేఖకు చిన్నతనం నుంచి ఎదుగుదల లేదు. మెదడు సరిగా ఎదగలేదు. ఫిట్స్ వస్తున్నాయి. వైద్య పరీక్షల ఆధారంగా 72 శాతం సదరం సర్టిఫికెట్ ఉన్నప్పటికీ, పింఛను ఇవ్వడం లేదు. నా భర్త చనిపోయాడని, వితంతు పింఛను వస్తుంది..దానిని కుమార్తె పింఛనుతో ముడిపెట్టి నిరాకరించడం అన్యాయం. అధికారులు సమస్యను పరిష్కరించాలి.

- ఎ.వరలక్ష్మి, చిన్నవాల్తేరు

'ఉచిత' ప్రయాణానికి బస్సులు సిద్ధం చేయండి

దాబాగార్డెన్స్: ఆగస్టు 15 నుంచి ప్రారంభమయ్యే మహిళల ఉచిత బస్సు ప్రయాణం నేపథ్యంలో అన్ని బస్సులను శుభ్రంగా, మంచి నిర్వహణతో సిద్ధం చేయాలని జిల్లా ప్రజా రవాణా అధికారి బి. అప్పలనాయుడు అద్దె బస్సుల యజమానులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం తన కార్యాలయంలో అద్దె బస్సుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా బస్సులు ఎప్పటికప్పుడు సరిచూడాలని, డ్రైవర్లకు తగిన సూచనలు చేయాలని కోరారు. బస్సులు మార్గమధ్యంలో ఆగిపోకుండా ఉండేందుకు యజమానులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాన్నారు. ప్రయాణికులతో డ్రైవర్లు గౌరవంగా ప్రవర్తించాలన్నారు. అద్దె బస్సుల డ్రైవర్లు ఆర్టీసీ సిబ్బంది వద్ద శిక్షణ పొంది, జీరో టికెట్ జారీ చేసే విధానాన్ని నేర్చుకోవాన్నారు. సమావేశంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ పద్మావతి, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ గంగాధర్, అద్దె బస్సుల గుమస్తా నాయుడు, అద్దె బస్సుల యజమానులు పాల్గొన్నారు.

మూడు దశల్లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు

మహారాణిపేట: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మూడు దశల్లో వివిధ కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. స్వాతంత్ర్య స్ఫూర్తిని, దేశభక్తి భావజాలాన్ని ప్రజల్లో నింపే విధంగా విస్తృత ప్రచార క్యాంపెయిన్లు నిర్వహించాలని సూచించారు. పౌరులు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయుట, ర్యాలీలు చేపట్టడం, ఇతర కార్యక్రమాల నిర్వహణలో ప్రోత్సాహం అందించాలని చెప్పారు. మొదటి దశ ఈనెల 2 నుంచి 8వ తేదీ వరకు, రెండోది 9 నుంచి 12వ తేదీ వరకు, 13 నుంచి 15వ తేదీ వరకు మూడో దశల్లో కార్యక్రమాలు చేపట్టాలన్నారు. తిరంగతో సెల్ఫీ, ప్రభాత్-ఫెరిస్, తిరంగ ర్యాలీలు, తిరంగ ప్రదర్శనలు, ఇతర అట్టడుగు స్థాయి జనభాగీదారీ కార్యక్రమాలు ఉంటాయని స్పష్టం చేశారు. సెల్ఫీలను www.harghartiranga.com వెబ్ సైట్ ద్వారా అప్‌లోడ్ చేయవచ్చని సూచించారు. అధికారులు, ప్రజలు హర్ ఘర్ తిరంగా వేడుకల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

అక్రమ మైనింగ్‌పై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు



కృష్ణాపురంలో అక్రమ మైనింగ్ చేస్తున్న ప్రాంతం

పద్మనాభం: కృష్ణాపురం గ్రామంలోని సర్వే నంబర్ 74/1లో అక్రమంగా మైనింగ్ చేస్తున్న మొకర నాగరాజు, మొకర గౌరినాయుడులపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన టి. రమేష్, బి. అప్పలనాయుడు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సర్పంచ్ లక్ష్మీ భవాని అండదండలతో వీరు అక్రమంగా బ్లాస్టింగ్ చేసి నల్లరాయిని తరలిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రోజుకు ఐదు నుంచి ఎనిమిది లారీల నల్లరాయిని అక్రమంగా తరలిస్తున్నారని, 20 నుంచి 30 అడుగుల లోతు వరకు తవ్వడం వల్ల జంతువులకు, వాటిని మేపే వారికి ప్రాణాలకు ప్రమాదం ఉందని ఫిర్యాదుదారులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

జీవీఎంసీ పీజీఆర్ఎస్‌లో 'టౌన్‌ప్లానింగ్'పై ఫిర్యాదులు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మొత్తం 99 ఫిర్యాదులు అందాయి. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించిన ఫిర్యాదులే అత్యధికంగా 54 ఉన్నాయి. నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి ఫిర్యాదులను స్వీకరించారు. అందిన ఇతర ఫిర్యాదుల్లో రెవెన్యూకు 10, ఇంజినీరింగ్‌కు 18, ప్రజారోగ్య విభాగానికి 5, యూసీడీ విభాగానికి 6 ఫిర్యాదులు ఉన్నాయి. ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మేయర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను వివరించారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్లు వేసిన చోట వీధి లైట్లు ఏర్పాటు చేయాలని జోన్-2 పరిధిలోని ప్రజలు కోరారు. అలాగే మధురవాడలో బరియల్ గ్రౌండ్ పనులను రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా నిలిచిపోయాయని ఆ ప్రాంత వాసులు మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించి పనులు ప్రారంభించాలని వారు కోరారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ శ్రీనివాసరావు

ఆ జీవో విద్యార్థుల గొంతు నొక్కేందుకే..!

- విద్యాశాఖ ఉత్తర్వులు వెనక్కితీసుకోవాలి
- ఉత్తర్వుల కాపీని దహనం చేసిన ఎస్ఎఫ్ఐ

బీచ్‌రోడ్డు: పాఠశాలల్లో విద్యార్థుల స్వేచ్ఛను, ప్రజాస్వామిక హక్కులను హరించే విధంగా ఉన్న విద్యాశాఖ ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఉత్తర్వుల ప్రతులను దహనం చేసి తమ నిరసనను వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్.జె. నాయుడు మాట్లాడుతూ పాఠశాల విద్యా కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వులు విద్యార్థులు తమ సమస్యలను బయటకు తెలియజేసే అవకాశాన్ని లేకుండా చేస్తున్నాయని ఆరోపించారు. ఈ ఉత్తర్వులు ప్రజాస్వామ్య విరుద్ధమని, విద్యార్థుల గొంతు నొక్కే ప్రయత్నమేనని ఆయన అన్నారు. ఈ ఉత్తర్వుల వల్ల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడానికి వెళ్లే విద్యార్థి సంఘాలకు అనుమతి లభించదని, దీనివల్ల విద్యార్థుల సమస్యలు బయటకు రాకుండా పోతాయన్నారు. మంత్రి నారా లోకేష్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యార్థి సంఘాలతో సంప్రదింపులు జరిపేవారని, ఇప్పుడు అటువంటి అవకాశం లేకుండా చేస్తున్నారన్నారు. ఒకవైపు రాజకీయాలకు తావివ్వొద్దని చెబుతూ, మరోవైపు పీటీఎం (పేరెంట్స్-టీచర్స్ మీటింగ్) పేరుతో రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ ఉత్తర్వులు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో జరుగుతున్న విద్యా వ్యాపారాన్ని, అరాచకాలను అడ్డుకునే అవకాశాన్ని లేకుండా చేస్తాయని ఎస్ఎఫ్ఐ నాయకులు అభిప్రాయపడ్డారు. దీంతో ప్రైవేటు పాఠశాలల దోపిడీ మరింత పెరిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ అప్రజాస్వామిక ఉత్తర్వులను ఉపసంహరించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని ఎస్ఎఫ్ఐ హెచ్చరించింది. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జి. అజయ్, ఉపాధ్యక్షుడు ఎం. కౌశిక్, ఎం. నరేష్, టి.మౌనిక, ఎం. కుసుమాంజలి, నాయకులు పి.ప్రగతి, ఎం.కావ్య, సీహెచ్. సూర్య, జి.సంజయ్, బి.భరత్ పాల్గొన్నారు.



ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ సభ్యులు

కదంతొక్కిన జర్నలిస్టులు

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాకు చెందిన జర్నలిస్టులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. సుమారు 14 డిమాండ్లతో జర్నలిస్టులు నినాదాలు చేసి, అనంతరం కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ఈ నెల 6న జరగబోయే మంత్రివర్గ సమావేశంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తీర్మానాలు ఆమోదించాలని ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్లు, బీమా సదుపాయం, పింఛన్లు జారీ చేయడం అవసరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించకపోతే, ఉద్యమాలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే రాష్ట్ర మంత్రులకు విశాఖలో జర్నలిస్టుల సమస్యలను వివరించామని శ్రీనుబాబు తెలిపారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోతుమహంతి నారాయణ్ మాట్లాడుతూ జర్నలిస్టులకు ఏసీ బస్సుల్లో ప్రయాణించే సదుపాయం, ప్రమాద బీమా పథకం అమలు చేయాలని, సమాచార శాఖ అన్ని విధాలా సహకరించాలని కోరారు. మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి, రైల్వే పాసులు జారీ చేయాలని, అక్రిడిటేషన్ కమిటీలలో జర్నలిస్టుల సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని, జర్నలిస్టుల కోసం వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేయాలని జర్నలిస్టుల ప్రతినిధులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి జి. శ్రీనివాస్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎ. సాంబశివరావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ పీఎస్ ప్రసాద్, బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్షుడు ఈరోతి ఈశ్వరరావు, స్మాల్ అండ్ మీడియం పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీఎస్. జగన్మోహన్, జర్నలిస్టులు పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శన చేస్తున్న జర్నలిస్టులు

సుజికీ ఎరీనా షోరూం ప్రారంభం

మురళీనగర్: దేశంలోనే నంబర్ వన్‌గా వెలుగొందుతున్న మారుతీ డీలర్ వరుణ్ మోటార్స్ ప్రైవేటు లిమిటెడ్‌కు చెందిన నూతన మారుతీ సుజుకీ ఎరీనా షోరూమ్‌ను మురళీనగర్‌లో సోమవారం ప్రారంభించారు. వరుణ్ గ్రూపు చైర్మన్ ప్రభుకిషోర్ ఈ కార్ల షోరూమ్‌ను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ విశాలమైన ప్రాంగణం, అధునాతన సౌకర్యాలు, అనుభవజ్ఞులైన సిబ్బందితో అత్యుత్తమమైన సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వరుణ్ గ్రూపు మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ దేవ్, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ హర్ష హనుమార, మారుతి సుజికి ఏరియా మేనేజర్ నరైన్ సింగ్ విర్క్, టెరిటరీ సేల్స్ మేనేజర్ కపిల్ గుప్తా, వరుణ్ మారుతి జీవీఎస్ఎన్ నవీన్ రాజు, ప్రసాదరాజు, నవీన్, మారుతి సిబ్బంది పాల్గొన్నారు.



షోరూంను ప్రారంభిస్తున్న ప్రభుకిషోర్

55 ఏళ్ల తర్వాత అదే జోష్

ఆనందాన్ని పంచిన పూర్వ విద్యార్థుల కలయిక



పూర్వ స్నేహితుల గ్రూప్ ఫొటో

దాబాగార్డెన్స్: హిందుస్థాన్ షిప్‌యార్డ్ గాంధీగ్రామ్ హైస్కూల్ 1970-71 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయికను సోమవారం ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 40 మంది విద్యార్థులు కలుసుకున్నారు. 55 ఏళ్ల తర్వాత దేశ విదేశాల్లో ఉన్న పాత మిత్రులంతా ఒకచోట చేరి చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ , మళ్ల అన్నపూర్ణ, కర్రి పద్మారావు, పీబీకే ఆనంద్, చైతన్య దళాయి, కె.వేంకటేశ్వరరావు, నండూరి వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

స్పా సెంటర్‌పై టాస్క్‌ఫోర్స్ దాడులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్-5లోని ఓ స్పా సెంటర్‌పై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. వ్యభిచార ముఠాను పట్టుకున్నారు. ఎంవీపీ కాలనీ పోలీసులతో కలిసి నిర్వహించిన ఈ దాడుల్లో స్పా సెంటర్ ముసుగులో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తించారు. వేర్వేరు ప్రాంతాల నుంచి యువతులను తీసుకొచ్చి వ్యభిచారం నిర్వహిస్తున్నారని, ఈ ముఠా లక్షలు సంపాదిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసిన పోలీసులు ఇద్దరు నిర్వాహకులతో పాటు, ఆరుగురు విటులను, ఇద్దరు కస్టమర్లను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ భరత్, ఎంవీపీ లా అండ్ ఆర్డర్ సీఐ మురళి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రక్షకులు కాదు.. గో భక్షకులు

గో సంరక్షకులుగా బిల్డప్ ఇస్తారు.. అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను పట్టుకుంటారు. పోలీసులకు అప్పగించి ఆ ఆవులను అధికారికంగానే చారిటబుల్ ట్రస్ట్ గోశాలకు తరలిస్తారు. ట్రస్ట్ ముసుగులో పశువులను ఇక్కడ నుంచి వ్యాన్లలో హైదరాబాద్‌కు తరలించి పశువధ చేసే వ్యాపారులకు విక్రయిస్తారు. కొందరు టీడీపీ నాయకులు ట్రస్టుగా ఏర్పడి చేస్తున్న దారుణమిది. దీనిపై ఎస్.రాయవరానికి చెందిన సోమిరెడ్డి వెంకట అప్పలసత్యసన్యాసి నూకరాజు లోకాయుక్తకు, కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హాలకు ఫిర్యాదు చేశారు.



వ్యాన్‌లో గోవులను తరలిస్తున్న దృశ్యం

- రక్షణ చారిటబుల్ ట్రస్ట్ పేరిట పశువుల అక్రమ రవాణా
- ఇక్కడ నుంచి వ్యాన్లలో హైదరాబాద్ 'కొట్టాయి'కి తరలింపు
- విజయవాడలో ఉన్న యానిమల్ వెల్ఫేర్ బోర్డు ద్వారా గుర్తింపు పత్రం
- ఎస్.రాయవరం మండలం పెనుగొల్లు గ్రామంలో చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు
- వారాంతపు సంతలను ఆదాయ వనరులుగా మార్చుకుంటున్న అక్రమార్కులు
- ఈ ఏడాది 10 వాహనాల్లో తరలిస్తూ పోలీసులకు పట్టుబడిన వైనం

సాక్షి, అనకాపల్లి:

దొంగలకు దొంగ.. ఘరానా దొంగ.. ఇలా ఎన్ని పేర్లతోనైనా వీరిని పిలుచుకోవచ్చు. రక్షణ చారిటబుల్ ట్రస్ట్ పేరుతో టీడీపీకి చెందిన కొందరు వ్యక్తులు అధికారుల కళ్లుగప్పి అక్రమార్జనకు తెరలేపారు. ఎస్.రాయవరం మండలం పెనుగొల్లు గ్రామంలో వీరు చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేశారు. ఏపీ యానిమల్ వెల్ఫేర్ బోర్డు ద్వారా అక్రమ మార్గంలో రికగ్నిషన్ సర్టిఫికెట్ పొంది గోశాలను నడుపుతున్నారు. జాతీయ రహదారిలో గోవులను అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను పట్టుకుని వాటిని పోలీసులు అప్పగించి ఆ ఆవులను చారిటబుల్ ట్రస్ట్‌కు తరలించుకుంటారు. అంతేకాకుండా ఏజెన్సీలోని పాడేరు, అరకు ప్రాంతాల్లో తక్కువ ధరకే గోవులను కొనుగోలు చేసుకుని ఇక్కడకు తీసుకొస్తారు. రక్షణ చారిటబుల్ ట్రస్ట్ ముసుగులో హైదరాబాద్‌లో పశువధ చేసే వ్యాపారుల 'కొట్టాయి'కి వ్యాన్లలో ఆవులను తరలిస్తున్నారు. ఎస్.రాయవరం మండలంలో పెనుగొల్లు, సోముదేవుపల్లి, గోకులపాడు, ధర్మవరం అగ్రహారం తదితర గ్రామాలకు చెందిన కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడి టీడీపీకి చెందిన నాయకుల అండదండలతో పెనుగొల్లు గ్రామంలో డోర్ నెం.2-8/2 అడ్రస్‌తో 'రక్షణ చారిటబుల్ ట్రస్ట్' ఏర్పాటు చేశారు.

పశు రవాణా నిబంధనలేంటి..

పాడి పశువులు, ఆవులు, దూడలు, ఎద్దులను వధించడంపై మన దేశంలో నిషేధం విధించినప్పటికీ యథేచ్ఛగా వధశాలలకు పశువులను తరలించడం నిత్యకృత్యంగా మారింది. వీటి తరలింపునకు ప్రత్యేక నిబంధనలున్నాయి. మూగజీవాలను రవాణా చేసే వాహనాలకు ప్రత్యేక రిజిస్ట్రేషన్ పత్రాలతోపాటు జీవాలను తరలించడానికి ప్రత్యేక ఏర్పాట్లు కలిగి ఉండాలి. పశువుల రవాణా సమయంలో మూగజీవాలకు సరిపడా గాలి, మేత, నీరు అందుబాటులో ఉండేటట్లు ఏర్పాట్లు చేయాలి. పెద్ద వాహనాల్లో పశువులను తరలించేటప్పుడు ఒక పశువు కోసం రెండు స్క్వేర్ మీటర్ల వంతున విడివిడిగా అరలను తయారు చేసి అందులో పశువులను తరలించవలసి ఉంటుంది. గూడ్స్ వాహనాల్లో పశువులను తరలించినా, పరిమితికి మించి మూగజీవాలను తరలించినా భారీ జరిమానాతో పాటు తరలించే వ్యక్తులపై కేసులు కూడా నమోదు చేసే అవకాశం ఉంది.

హైవేపై రవాణా చేసేవారే టార్గెట్..

అనకాపల్లి జిల్లాలో జాతీయ రహదారిపై అర్ధరాత్రి సమయంలో వాహనాల్లో పశువుల రవాణా నిర్భయంగా సాగుతోంది. ఈ రవాణాదారులనే లక్ష్యంగా చేసుకొని ట్రస్టు ముసుగులో పశువులను రక్షిస్తామని స్వాధీనం చేసుకుంటున్నారు. అదే తప్పు దర్జాగా వీరు కూడా చేస్తున్నారు. ఒక్కో వాహనంలో 20 నుంచి 40 వరకు పశువులను తాళ్లతో బంధించి అతి క్రూరంగా వాహనాల్లో తరలిస్తున్నట్లు సమాచారం. రాత్రి వేల పెద్ద ఎత్తున అక్రమంగా పశువుల రవాణా జరుగుతున్నా అధికారులెవరూ పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు



హోంమంత్రి అనితతో రక్షణ చారిటబుల్ ట్రస్ట్ మేనేజర్ దేముళ్లు

క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

పవిత్రంగా భావించే గోవులను అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. స్వచ్ఛంద సంస్థ ముసుగులో వివిధ స్టేషన్లలో పోలీసులు పట్టుకున్న ఆవులు, ఏజెన్సీ ప్రాంతం నుంచి వచ్చిన ఆవులు, పశువులు, తమ సంస్థ షెడ్‌కు పెద్ద సైజు వ్యానుల్లో తరలిస్తుంటారు. అక్కడ నుండి చిన్న సైజు వాహనాల్లో అనకాపల్లి బోర్డర్ తుని వరకు ట్రస్టు పేరుతో పంపిస్తారు. అక్కడ నుంచి వేరే వ్యక్తులు హైదరాబాద్‌కు తరలిస్తుంటారు. కొన్ని ఆవులు తిండి లేక, అనారోగ్యంతో, తరలింపు సమయంలో గాయాలపాలై మృతి చెందుతున్నాయి. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఇటీవలే పోలీసులు 10 మందికి పైగా పశువుల అక్రమ రవాణా చేసే వారిని పట్టుకుని వారిపై కేసులు నమోదు చేశారు. ఆ ఆవులను ఈ సంస్థకే తరలించారు.

- సోమిరెడ్డి వెంకట అప్పలసత్యసన్యాసి నూకరాజు, ఎస్.రాయవరం